# జాగృతి-హెచ్ఎంఎస్ టై అప్ !

- సింగరేణిలో కవిత కొత్త వ్యూహం
- హెచ్ఎంఎస్‌తో కలసి కార్యాచరణకు రంగం సిద్ధం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

సింగరేణి కార్మిక రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కార్మికుల మద్దతు కోసం సింగరేణిలో కొత్త వ్యూహానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ యూనియన్ నేతలతో చర్చలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సింగరేణి కార్మిక నాయకుడు రియాజ్ అహ్మద్‌ను కవిత హైదరాబాద్‌లోని తన నివాసంలో రహస్యంగా కలిశారు. ఈ సమావేశంలో సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కుల రక్షణ, ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్ కార్మికుల పునర్నియమకాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తెలంగాణ జాగృతి సంస్థతో హెచ్ఎంఎస్ కలసి పనిచేసే అంశంపై ఫోకస్ చేసినట్టు సమాచారం. సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని రియాజ్ అహ్మద్ పలు మీడియా సంస్థలకు వెల్లడించారు. ఇటీవల కవిత 'సింగరేణి జాగృతి' పేరిట కొత్త సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పలువురు కోఆర్డినేటర్లను నియమించారు. ఇప్పటికే బీఆర్ఎస్ అనుబంధంగా టీబీజీకేఎస్ పనిచేస్తున్నా, మరో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేయడంపై కార్మిక వర్గాల్లో అనేక అనుమానాలు మొదలయ్యాయి. సింగరేణిలో బలమైన రాజకీయ ప్రాతినిధ్యం కోసం కవిత అడుగు ముందుకు వేసినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. కవిత రాజకీయంగా తన పునరాగమనం కోసం సింగరేణిని ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకునే ప్రయత్నంలో ఉన్నట్టు పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇటీవల కేసీఆర్‌కు లేఖ రాసిన తర్వాత తన మొదటి పర్యటనను నల్లనేల ప్రాంతంలో ప్రారంభించిన కవిత, తన వెంటే ఎవరు వస్తారు, బలాబలాలేంటన్నది నిశితంగా గమనిస్తూ వ్యూహాత్మకంగా ముందడుగు వేసినట్టు తెలుస్తున్నది. ఈ నెల 10న హెచ్ఎంఎస్ నేతలు, సింగరేణి జాగృతి ప్రతినిధులు మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. ఈ సమావేశం ద్వారా కొత్త కూటమికి స్పష్టమైన రూపం లభించే అవకాశముంది. కార్మిక సంఘాల మద్దతుతో రాజకీయంగా తమ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలన్న లక్ష్యంతో కవిత ఈ ప్రయత్నాల్లో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తున్నది.

# నేడు చొప్పదండిలో టెన్త్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, శిశు మందిర్ స్కూళ్లలో పదవ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో నేడు చొప్పదండి నియోజకవర్గంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని బండి సంజయ్ ప్రారంభించనున్నారు. ప్రధానమంత్రి "నరేంద్ర మోదీ కానుక" పేరుతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి బండి సంజయ్ స్వయంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) నిధులను సేకరించి సైకిళ్లను కొనుగోలు చేశారు. అవకతవకలకు తావు లేకుండా నేరుగా టెన్త్ విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో, ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చొప్పదండి పట్టణంలో 'ప్రధానమంత్రి కిసాన్ ఉత్సవ్ దివస్' కార్యక్రమంలో పాల్గొనే బండి సంజయ్, రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధి సొమ్మును జమ చేయనున్నారు. ఇప్పటికే కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో సైకిళ్ల పంపిణీ కొనసాగుతుండగా, ఇప్పుడు చొప్పదండి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. చొప్పదండి మండలంలో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమానికి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు బండి సంజయ్ విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తారు.

**టెన్త్ విద్యార్థులకు ఎందుకు?**

ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు ఎక్కువగా పేద కుటుంబాల నుండి వచ్చిన వారే. రవాణా సౌకర్యాల్లేక స్కూళ్లకు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల అవసరాన్ని గుర్తించి, ముఖ్యంగా టెన్త్ క్లాస్‌లో స్పెషల్ క్లాసులకు హాజరు కావాల్సి వస్తుండటంతో, రవాణా సౌకర్యంగా ఈ సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు బండి సంజయ్ పేర్కొన్నారు.

# బీసీలకు కాంగ్రెస్ ద్రోహం

- రిజర్వేషన్లపై కపట ప్రేమ
- 8న సర్కస్ గ్రౌండ్‌లో బీసీ గర్జన
- ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ సమావేశం
- హాజరైన సీనియర్ బీసీ నేతలు



**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడమే పరిష్కారం అని ఎన్నిసార్లు సూచించినా, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. శుక్రవారం చింతకుంటలో బీఆర్ఎస్ భవన్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో శాసనమండలి పక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీకి బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో నిబద్ధత లేదని మధుసూదనాచారి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చే ముందు 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఆచరణలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. షెడ్యూల్ 9లో చేర్చడమే పరిష్కారమని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాము చెప్పిన విధంగా తీర్మానం చేసి ఢిల్లీకి వెళ్లాలని సూచించారు.బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడతామని గంగుల కమలాకర్ హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధత కల్పించడంలో కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 8న కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో జరిగే బీసీ సభ ద్వారా ప్రభుత్వాన్ని హెచ్చరించాలని పిలుపునిచ్చారు.బీసీల భవిష్యత్తు దృక్పథంతోనే బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. తమ హయాంలో బీసీ రిజర్వేషన్లను తగ్గించలేదని, కాంగ్రెస్‌కు చెందిన స్వప్నరెడ్డి కోర్టుకు వెళ్లడంతో 34 శాతానికి పెంచిన రిజర్వేషన్లను కోర్టు కొట్టివేసిందన్నారు. అయినా తాము సుప్రీంకోర్టు వరకు వెళ్ళినా, 50 శాతానికి మించరాదని కోర్టు తీర్పు వల్ల 24 శాతానికి పరిమితం చేయాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కూడా గతంలో విఫలమైన విధానాన్నే అనుసరిస్తోందని విమర్శించారు.ఈ సమావేశంలో సర్కస్ గ్రౌండ్‌ను సభా వేదికగా పరిశీలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్ పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి



**శెనార్తి మీడియా, పెద్దపల్లి:**

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, ఎవరైన రైతులు పాస్‌బుక్ తీసుకురాకుండా వస్తే సాగు ఎక్కడ చేస్తున్నారో వివరాలు తెలుసుకొని ఇవ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. చిన్నకల్వలలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, ఎంపియూపిఎస్, ప్యాక్స్ ఎరువుల గోడౌన్, నారాయణపూర్‌లోని ఎంపిపిఎస్, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్ వాడి కేంద్రం, పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నారాయణపూర్ పాఠశాలల వద్ద శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి రాబోయే ఐదేళ్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సుల్తానాబాద్ మండలంలో 526 ఇందిరమ్మ ఇండ్లు మంజూర య్యాయని, 94 ఇండ్లు బేస్మెంట్ వరకు పూర్తయ్యాయన్నారు. చిన్నకల్వలలో మంజూరైన 15 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ ఆసుపత్రిలో పలు వార్డులను పరిశీలించారు. నెలకు 29 ప్రసవాలు జరుగుతున్నాయని, అదనపు సిబ్బంది, స్కాన్‌మిషన్ మంజూరు చేస్తామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, తహసీల్దార్ బషీరుద్దీన్, మండల పంచాయతీ అధికారి సమీర్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, పంచాయతీ రాజ్ ఏఈ సచిన్, మండల విద్యాశాఖ అధికారి రాజయ్య , మండల వ్యవసాయ అధికారి నాగార్జున పాల్గొన్నారు. చిన్నకల్వల సింగిల్ విండో గోదాంను కలెక్టర్ తనిఖీ చేశారు. యూరియా బస్తాలు వివరాలను తెలుసుకున్నారు. సీఈవో వల్లకొండ రమేష్, ఏవో నాగార్జున పాల్గొన్నారు




# అధిక టారిఫ్‌లపై సీపీఎం నిరసన

**ట్రంప్ చిత్రం దహనం**

**శెనార్తి మీడియా, శంకరపట్నం**

భారత ఎగుమతులపై అమెరికా 25 శాతం టారిఫ్‌లు విధించడం దేశ ఉత్పత్తి రంగాలు, ఉపాధి, చిన్న పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపనుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, మండల కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి పేర్కొన్నారు.అమెరికన్ మార్కెట్‌పై ఆధారపడుతున్న దుస్తులు, టెక్స్టైల్స్, ఫార్మా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, వాహనాలు, రత్నాలు, అభరణాలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ ఎగుమతులపై టారిఫ్‌లు ప్రభావం చూపుతాయన్నారు. మోడీ దోస్త్ ట్రంప్ మోడీకే మొండి చేయి చూపించారని విమర్శించారు. దేశీయ మార్కెట్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆధునిక పరిశ్రమల ద్వారా దేశంలోనే ఉపాధి కల్పించేలా ఆర్థిక విధానాల్లో మార్పులు అవసరమన్నారు. మన సాగు, పాడి, పౌల్ట్రీ రంగాల పరిరక్షణకు అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్నట్టు తెలిపారు. అమెరికాలో ఈ రంగాలకు భారీ సబ్సిడీలు అందుతున్నా, మన దేశంలో మాత్రం తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలు తగ్గిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందన్నారు. రక్షణ కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒత్తిడికి మోడీ ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శించారు. 2009–13 మధ్య రష్యా ఆయుధాల వాటా 76 శాతంగా ఉండగా, ప్రస్తుతం అది 36 శాతానికి తగ్గిందన్నారు. ఇప్పుడు అమెరికా ఎఫ్–35 యుద్ధ విమానాలు, ఎంక్యూ–9బి డ్రోన్లు, పీ–81 విమానాలు కొనాలని ఒత్తిడి పెడుతోందని చెప్పారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు నిలిపివేయాలని కూడా అమెరికా పరోక్ష ఒత్తిడి చేస్తోందన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగకుండా పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో యుగంధర్, చక్రపాణి, తిరుపతి, వెంకటేష్, బుచ్చయ్య పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



**శెనార్తి మీడియా,శంకరపట్నం :**

శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు–2 అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ముర్రుపాలు శిశువు ఆరోగ్యానికి రక్షణ కవచంలా ఉంటాయన్నారు. గర్భిణీ దశలో పోషకాహారం, కుటుంబ సహకారం అవసరమన్నారు. సూపర్వైజర్ పద్మ, ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి గాయాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం (చిగురుమామిడి):**




చిగురుమామిడి మండలం రేగొండకు చెందిన మోరే రాజు (38), మామిడి కనకయ్య (55) బైక్ పై కరీంనగర్ నుండి రేకొండకు వచ్చి, కార్యక్రమం ముగించుకుని తిరిగి కరీంనగర్ వెళ్తుండగా మొగిలిపాలెం శివారులో మోటార్ సైకిల్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో కనకయ్య అక్కడికక్కడే మృతి చెందగా, రాజు తలకు బలమైన గాయాలతో రోడ్డుపై పడిపోయాడు. సమాచారం అందిన వెంటనే 108 సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ గోపికృష్ణ ఘటన స్థలానికి చేరుకుని రాజును ప్రతిమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# భక్తులతో కిటకిటలాడిన మహాశక్తి దేవాలయం

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**



శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా కరీం నగర్ పట్టణం చైతన్యపురిలోని మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.. మహిళలు అశేష సంఖ్యలో తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్లకు ఓడి బియ్యం సమర్పించారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్ర వారాలకు ఎంతో విశిష్టత ఉండడంతో, ముఖ్యంగా అమ్మ వార్లను భక్తి శ్రద్ధలతో పూజించే వారంగా శ్రీ మహాశక్తి దేవా లయంలోని ఆ అమ్మవార్లను పూజించడం వల్ల ఐశ్వర్యం, సౌభాగ్యం: సిద్ధిస్తాయని మహిళలు ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు. దేవాలయంలోని ముగ్గురు శక్తివంతమైన అమ్మవార్ల ను పూజిస్తే తమ కుటుంబసభ్యులు సుఖ సంతోషాలతో ఉంటారని శ్రీ మహాశక్తి దేవాలయానికి వచ్చే భక్తుల విశ్వా సం, సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమ పూజలు ఘనం గా జరిగాయి. మహిళలు లక్ష్మి దేవి పూజలో పాల్గొని, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.







# పచ్చిక పిచ్‌పై పేసర్ల వీరవిహారం

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 247 ఆలౌట్**

**నిప్పులు చెరిగిన సిరాజ్, ప్రసిద్ధ్**

**రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 75/2**

**ఓవల్‌లో రెండో రోజు 15 వికెట్లు**




ఓవల్: పచ్చికతో కూడిన ఓవల్ పిచ్ పేసర్లకు సహకరిస్తుండటంతో భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదో టెస్టులో రెండో రోజు ఇరుజట్ల బౌలర్లు వికెట్ల పండుగ చేసుకున్నారు. రెండు జట్ల పేసర్లు 15 (భారత్ 9, ఇంగ్లండ్ 6) వికెట్లు పడగొట్టడంతో సిరీస్ విజేతను తేల్చే నిర్ణయాత్మక టెస్టు రసకందాయకంలో పడింది. గిల్ సేన తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఆలౌట్ అవగా బదులుగా ఇంగ్లండ్.. 247 రన్స్‌కు కుప్పకూలింది. భారత పేస్ ద్వయం ప్రసిద్ధ్ కృష్ణ (4/62), మహ్మద్ సిరాజ్ (4/86) నిప్పులు చెరిగారు. జాక్ క్రాలీ (57 బంతుల్లో 64, 14 ఫోర్లు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడగా హ్యారీ బ్రూక్ (64 బంతుల్లో 53, 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు వచ్చిన టీమ్ఇండియా.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. జైస్వాల్ (49 బంతుల్లో 51 నాటౌట్, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ శతకంతో కదం తొక్కాడు. రాహుల్ (7), సాయి (11) ఔట్ అయ్యారు. భారత ఆధిక్యం 52 పరుగులుగా ఉ ంది.

**34 బంతుల్లోనే..**

తొలి రోజు తడబడ్డా సాయి, కరుణ్ (57) పోరాటంతో నిలదొక్కుకున్న భారత్.. రెండో రోజు 34 బంతుల్లో మరో 20 పరుగులు జోడించి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. అట్కిన్సన్ (5/33), టంగ్ (3/57) ధాటికి భారత లోయరార్డర్ నిలువలేకపోయింది. రెండో రోజు టంగ్ తన రెండో ఓవర్లోనే కరుణ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ మరుసటి ఓవర్లో అట్కిన్సన్.. వాషింగ్టన్ (26)ను ఔట్ చేశాడు. తన తర్వాతి ఓవర్లో అతడు.. సిరాజ్, ప్రసిద్ధ్‌ను డకౌట్ చేయడంతో భారత ఇన్నింగ్స్ ముగిసింది.

**నాటు కొట్టుడు**

తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ ఎప్పట్లాగే దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్.. బుమ్రా లేని భారత బౌలింగ్ దళాన్ని చెడుగుడు ఆడుకున్నారు. క్రాలీ అయితే బౌండరీలతో విరుచుకుపడటంతో ఒకదశలో ఇంగ్లండ్ రన్‌రేట్ 7దాకా చేరింది. మరో ఎండ్‌లో డకెట్.. ఆకాశ్ దీప్‌ను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. సిరాజ్ కూడా ప్రభావం చూపకపోవడంతో ఇంగ్లండ్ 12 ఓవర్లకే 92/0గా నిలిచింది. అయితే ఆకాశ్.. 13వ ఓవర్లో డకెట్‌ను ఔట్ చేయడంతో గిల్ సేన ఊపిరి పీల్చుకుంది. ఆకాశ్ బౌలింగ్‌లోనే బౌండరీతో క్రాలీ ఈ సిరీస్‌లో మూడో అర్ధ శతకం పూర్తిచేశాడు.

**ఏం తినొచ్చారో గానీ..**

భోజన విరామానికి వెళ్లిన భారత పేస్ దళం.. ఏం తినొచ్చిందో గానీ లంచ్ తర్వాత ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. లంచ్ అనంతరం ప్రసిద్ధ్ వేసిన ఇన్నింగ్స్ 22వ ఓవర్లో షాట్ ఆడబోయిన క్రాలీ.. మిడ్‌వికెట్ వద్ద జడేజాకు క్యాచ్ ఇచ్చాడు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఇదే కీలకమలుపు. 25వ ఓవర్లో గిల్.. సిరాజ్ చేతికి బంతినివ్వడంతో ఆతిథ్య జట్టు కష్టాలు రెట్టింపయ్యాయి. ఈ హైదరాబాదీ పేసర్ మొదట.. పోప్ (22)ను వికెట్ల ముందు బలిగొనగా కొద్దిసేపటికి జో రూట్ (29)నూ లెగ్‌బిఫోర్‌గా వెనక్కి పంపాడు.



అదే ఊపులో బెతెల్ (6)నూ యార్కర్‌తో బోల్తా కొట్టించాడు. 42వ ఓవర్లో ప్రసిద్ధ్.. స్మిత్ (8), ఓవర్టన్ (0)ను ఔట్ చేసి ఇంగ్లండ్ నడ్డివిరిచాడు. అట్కిన్సన్ (11).. ప్రసిద్ధ్ బౌలింగ్‌లోనే ఆకాశ్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఈ క్రమంలో హ్యారీ బ్రూక్ ఒంటరిపోరాటం చేసి ఆతిథ్య జట్టుకు 23 పరుగుల కీలక ఆధిక్యాన్ని కట్టబెట్టాడు. అర్ధశతకం తర్వాత బ్రూక్.. సిరాజ్ వేసిన 52వ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అవడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. తొలి ఇన్నింగ్స్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడటంతో క్రిస్ వోక్స్ బ్యాటింగ్‌కు రాలేదు. గాయంతో అతడు ఈ మ్యాచ్ మొత్తానికి దూరమయ్యాడు.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 224 ఆలౌట్ (కరుణ్ 57, సాయి 38, అట్కిన్సన్ 5/33, టంగ్ 3/57)బీ

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 51.2 ఓవర్లలో 247 ఆలౌట్ (క్రాలీ 64, బ్రూక్ 53, ప్రసిద్ధ్ 4/62, సిరాజ్ 4/86)బీ

భారత్ రెండో ఇన్నింగ్స్: 18 ఓవర్లలో 75/2 (జైస్వాల్ 51లి, టంగ్ 1/25)




## బుమ్రాపై బీసీసీఐ సీరియస్?

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లండ్ పర్యటనలో జస్‌ప్రీత్ బుమ్రా మూడు టెస్ట్‌లు మాత్రమే ఆడిన విషయం తెలిసిందే. ఓవల్ వేదికగా గురువారం ప్రారంభమైన ఆఖరి టెస్ట్ మ్యాచ్‌కు బుమ్రా దూరంగా ఉ న్నాడు. వర్క్‌లోడ్‌లో భాగంగానే అతన్ని టీమిండియా మేనేజ్‌మెంట్ దూరంగా ఉంచింది. అయితే బుమ్రాకు రెస్ట్ ఇవ్వడాన్ని మాజీ క్రికెటర్లు తప్పుబట్టారు. అన్ని మ్యాచ్‌లు ఆడలేనప్పుడు సిరీస్‌లకు ఎంపిక చేయడం ఎందుకని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే బుమ్రా విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటేనే బుమ్రాను జట్టులోకి తీసుకోవాలని సెలెక్టర్లకు సూచించినట్లు వార్తలు వస్తున్నాయి.'స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కోచ్‌లు ఎప్పటికప్పుడు ఆటగాళ్ల వర్క్‌లోడ్‌పై అధ్యయనం చేస్తూనే ఉంటారు. బుమ్రా ఫిట్‌గా ఉండటం జట్టుకు కీలకం. వైద్య బృందం పర్యవేక్షించిన తర్వాతే అతన్ని తుది జట్టులో ఆడించడం జరుగుతుంది. అతను అన్ని మ్యాచ్‌లు ఆడగలడని భావిస్తేనే ఏదైనా సిరీస్‌కు ఎంపిక చేయాలనే ఆలోచనలో బీసీసీఐ, సెలెక్షన్ కమిటీ ఉంది.'అని ఓ బీసీసీఐ అధికారి చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది.అయితే ఈ వార్తలను టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ఖండించాడు. ఇందులో నిజం లేదని చెప్పాడు. 'బుమ్రాపై వస్తున్నవన్నీ తప్పుడు వార్తలే. అతన్ని అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆడించాలని అనుకుంటాం. కానీ అతని శరీరం సహకరించాలి కదా? అతని శరీరానికి గౌరవం ఇవ్వాలి. అందుకే బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను జాగ్రత్తగా పరీక్షిస్తున్నాం. ఇష్టానుసారం ఆడుతానని బుమ్రా ఎప్పుడూ చెప్పలేదు. ఇలాంటి కామెంట్స్ రావడం బాధాకరం. మూడు టెస్ట్‌లు మాత్రమే ఆడుతానని సిరీస్‌కు ముందే చెప్పాడు. ఆ మ్యాచ్‌లు ఏంటో మేనేజ్‌మెంటే నిర్ణయించాలన్నాడు. పరిస్థితులకు అనుగుణంగా మేం నిర్ణయాలు తీసుకున్నాం.'అని డస్కాటే పేర్కొన్నాడు.జస్‌ప్రీత్ బుమ్రా సుదీర్ఘ కాలంగా వెన్ను గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అతని విలక్షణమైన బౌలింగ్ శైలి కారణంగా వెన్నుపై అదనపు భారం పడుతోంది. గతేడాది టీ20 ప్రపంచకప్ ముందు జట్టుకు దూరమైన బుమ్రా.. న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బరిలోకి దిగాడు. ఈ పర్యటనలో కెప్టెన్‌గా జట్టు బౌలింగ్ భారాన్ని ఒక్కడే మోసాడు. ఆ సిరీస్ ఆఖరి మ్యాచ్‌లో గాయపడిన అతను ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఆడలేదు. మళ్లీ ఐపీఎల్‌తోనే రీఎంట్రీ ఇచ్చాడు. నాలుగో టెస్ట్‌లో బుమ్రా పేస్ దారుణంగా పడిపోయింది. చీల మండ గాయంతో కూడా అతను ఇబ్బంది పడ్డాడు. ఈ క్రమంలోనే అతను ఆఖరి మ్యాచ్‌కు దూరమయ్యాడు.

# శుభ్‌మన్ గిల్ ఆల్‌టైమ్ రికార్డ్



లండన్ ఓవల్ టెస్టులో టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్?లో తొలి మ్యాచ్ నుంచి ఫుల్ ఫామ్‌లో ఉన్న గిల్ తాజాగా ఐదో టెస్టులో 46ఏళ్ల రికార్డును బ్రేక్ చేశాడు. ఐదో టెస్టు తొలి రోజు మ్యాచ్‌లో గిల్ లంచ్ బ్రేక్ సమయానికి (15) పరుగులు చేశాడు. దీంతో ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు బాదిన భారత కెప్టెన్‌గా గిల్ రికార్డుల్లోకెక్కాడు. ఈ క్రమంలోనే మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ రికార్డ్ బ్రేక్ చేశాడు. ప్రస్తుతం గిల్ ఈ సిరీస్?లో 743 పరుగులు చేశాడు. గతంలో ఈ లిస్ట్?లో సునీల్ గావస్కర్ 732 పరుగులతో టాప్?లో ఉ న్నాడు. 1978-79లో వెస్టిండీస్‌పై గావస్కర్ ఈ స్కోర్ సాధించాడు. దీంతో దాదాపు 46ఏళ్లుగా గావస్కర్ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు బాదిన కెప్టెన్‌గా కొనసాగుతూ వచ్చాడు. తాజా సిరీస్‌లో గిల్ ఈ రికార్డును బ్రేక్ చేశాడు. కాగా, ఈ సిరీస్?లో గిల్ ఇప్పటికే 743 పరుగులు చేశాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో 92.88 సగటుతో గిల్ ఈ గణాంకాలు నమోదు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. అలాగే ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గానూ గిల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు బాదిన టీమ్ఇండియా ప్లేయర్లలో గావస్కర్ 774 పరుగులతో టాప్‌లో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లోనే గిల్ ఈ రికార్డు కూడా బ్రేక్ చేసే ఛాన్స్ ఉంది. టెస్టు హిస్టరీలో సింగిల్ సిరీస్‌లో ఓ ప్లేయర్ బాదిన అత్యధిక పరుగులు 974. ఆస్ట్రేలియా లెజెండరీ క్రికెటర్ డాన్ బ్రాడ్‌మన్ 1930లో యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్‌పై 974 పరుగులు చేశాడు. అలాగే ఈ సిరీస్‌లో బ్రాడ్‌మన్ మొత్తం 4 సెంచరీలు సాధించాడు. గత 95 ఏళ్ల నుంచి టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు నమోదు చేసిన రికార్డ్ బ్రాడ్‌మన్ పేరిటే కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుత సిరీస్?లో ఈ రికార్డ్ బ్రేక్ చేసేందుకు గిల్‌కు ఛాన్స్ ఉంది.ఈ సిరీస్?లో ఇప్పటిదాకా గిల్ 743లి పరుగులు చేశాడు. మరో 231 పరుగులు చేస్తే, గిల్ వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేసిన బ్యాటర్ అవుతాడు. ఈ మ్యాచ్‌లో ఇంకో రెండు ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. రెండో ఇన్నింగ్స్?ల్లోనూ భారీ ఇన్నింగ్స్ ఆడితేనే గిల్?కు ఆ ఘనత సాధించే ఛాన్స్ ఉంది. మరి గిల్ ఏం చేస్తాడో చూడాలి!ప్రస్తుత సిరీస్?లో గిల్ శతకాల మోత మోగిస్తున్నాడు. ఇటీవల మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు రెండో ఇన్నింగ్స్?లో సెంచరీతో రాణించారు. ఈ సిరీస్?లో గిల్?కు అది నాలుగో శతకం. తొలి టెస్టులో శతకం బాదగా, ఎడ్జ్?బాస్టన్ టెస్టులో (269 పరుగులు, 161 పరుగులు) రెండు సెంచరీలు నమోదు చేశాడు. దీంతో క్రికెట్ ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌లో అత్యధిక సెంచరీలు బాదిన కెప్టెన్‌గా దిగ్గజాలు సునీల్ గావస్కర్, డాన్ బ్రాడ్‌మన్ మన్ రికార్డును సమం చేశాడు.




## కోహ్లీ బాత్రూమ్‌లో ఏడవడం చూశా

**వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్**

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ బాత్రూమ్‌లో ఏడవడం చూశానని వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తెలిపాడు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఓటమి కోహ్లీ తట్టుకోలేకపోయాడని గుర్తు చేసుకున్నాడు. కోహ్లీతో పాటు జట్టులోని ఆటగాళ్లంతా కన్నీటి పర్యంతమయ్యారని చెప్పాడు. ఇంగ్లండ్ వేదికగా జరిగిన ఈ ప్రపంచకప్‌లో అసాధారణ ప్రదర్శనతో సెమీస్ చేరిన భారత్.. తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్ రెండు రోజుల పాటు జరగ్గా.. టీమిండియా గెలుపు కోసం జడేజా, ధోనీ ఆఖరి వరకు పోరాడారు. కానీ చివర్లో ధోనీ రనౌట్‌గా వెనుదిరిగడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. ఆ పరాజయాన్ని భారత అభిమానులు కూడా జీర్ణించుకోలేకపోయారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న చాహల్.. ఈ మ్యాచ్‌ను గుర్తు చేసుకున్నాడు. '2019 వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఓటమి తట్టుకోలేక కోహ్లీ కన్నీటి పర్యంతమయ్యాడు. అతనే కాదు జట్టులోని ఆటగాళ్లంతా ఏడ్చారు. నేనే చివరిగా క్రీజులో నుంచి వచ్చా. కోహ్లీని దాటి ముందుకెళ్తుంటే అప్పటికే అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. ధోనీకి అదే ఆఖరి మ్యాచ్. ఆ క్షణమే బౌలింగ్‌లో నేను 15 పరుగులు తక్కువగా ఇవ్వాల్సిందని అనిపించింది. నేను ఇంకొంచెం ఉత్తమంగా బౌలింగ్ చేసి ఉంటే బాగుండేదనిపించింది.'అని చాహల్ పేర్కొన్నాడు. ఆ మ్యాచ్‌లో చాహల్ 10 ఓవర్లో 63 పరుగులిచ్చి ఒక్క వికెట్ మాత్రమే తీసాడు. ఈ ఓటమి కారణంగా విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఒక్క ఐసీసీ టైటిల్‌ను అందించలేకపోయాడు. అతని సారథ్యంలో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేసింది. అతని సారథ్యంలో టీమిండియా 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ చేరడం, 2019 వన్డే ప్రపంచకప్ సెమీస్, డబ్ల్యూటీసీ 2021 ఫైనల్ చేరింది. కానీ తృటిలో టైటిల్ అందుకోలేకపోయింది. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ.. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు.

# ఉత్తమ తెలుగు చిత్రం 'భగవంత్ కేసరి'

## జాతీయ చలన చిత్ర అవార్డులు




71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా '12 ఫెయిల్'కు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు పంచుకున్నారు. షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12 ఫెయిల్)లు ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా 'మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' (హిందీ)లో నటనకు రాణీ ముఖర్జీని అవార్డు వరించింది. ఇక ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరిని అవార్డు వరించింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో శ్రీలీల, కాజల్ కీలక పాత్రలు పోషించారు. అలాగే, ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో 'హను-మాన్' చిత్రం అవార్డు దక్కించుకోగా, ఉత్తమ గేయ రచయితగా 'బలగం'లో 'ఊరు పల్లెటూరు' పాటకు గానూ కాసర్ల శ్యామ్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇక ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్'కు అవార్డు దక్కింది. బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ అవార్డు ఉత్పల్ దత్త (అస్సామీ)కు ప్రకటించారు. తొలుత నాన్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరి అవార్డులను వెల్లడించారు.

### జాతీయ చలన చిత్ర అవార్డులు ఫీచర్ ఫిల్మ్

- ఉత్తమ మ్యూజిక్ దర్శకత్వం : వాతి (తమిళ్) జీవీ ప్రకాశ్ కుమార్
- ఉత్తమ సంతితం (నేపథ్యం): యానిమల్: హర్షవర్ధన్ రామేశ్వర్
- బెస్ట్ మేకప్: సామ్ బహూదర్ (హిందీ) శ్రీకాంత్‌దేశాయ్
- బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్: సామ్ బహదూర్ (హిందీ)
- బెస్ట్‌ప్రొడక్షన్ డిజైన్: 2018 – ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో (మలయాళం) మోహన్‌దాస్
- బెస్ట్ ఎడిటింగ్: పూక్కాలమ్ (మలయాళం) మిధున్ మురళి
- బెస్ట్ సౌండ్ డిజైన్: యానిమల్ (హిందీ) సచిన్ సుధాకరన్, హరి హరన్ మురళీ ధరన్
- బెస్ట్ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): బేబీ (తెలుగు) సాయి రాజేశ్ నీలం
- బెస్ట్ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): పార్కింగ్ (తమిళ్) రామ్‌కుమార్ బాలకృష్ణన్
- ఉత్తమ సంభాషణలు: సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై (హిందీ) దీపక్ కింగ్రానీ
- ఉత్తమ సినిమాటోగ్రఫీ: ది కేరళ స్టోరీ (హిందీ): పసంతను మొహపాత్రో
- ఉత్తమ నేపథ్య గాయని: జవాన్ (చెలియా) శిల్పారావు
- ఉత్తమ నేపథ్య గాయకుడు: బేబీ( పీవీన్ ఎస్ రోహిత్)
- బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్: గాంధీతాత చెట్టు (సుకృతివేణి), జిప్సీ (మరాఠీ) కబీర్ ఖందారీ, నాల్ 2 (మరాఠీ) త్రిష థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్దిప్
- ఉత్తమ సహాయ నటి: ఉల్లుకు (మలయాళం) ఊర్వశి, వష్ (గుజరాతీ) జానకీ బోడివాలా
- ఉత్తమ సహాయ నటుడు: పూక్కాలం (మలయాళం) విజయ రాఘవన్,, పార్కింగ్ (తమిళ్) ముత్తుపెట్టాయ్ సోము భాస్కర్
- ఉత్తమ నటి: మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ):రాణీ ముఖర్జీ
- ఉత్తమ నటుడు: జవాన్ (హిందీ) షారుక్‌ఖాన్, 12 ఫెయిల్ (హిందీ) విక్రాంత్ మస్సే
- ఉత్తమ దర్శకత్వం: ది కేరళ స్టోరీ (హిందీ) సుదీప్తో సేన్
- ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ మూవీ: హనుమాన్ (తెలుగు)
- ఉత్తమ బాలల చిత్రం: నాల్ (మరాఠీ)
- ఉత్తమ జాతీయ సమగ్రత, సామాజిక విలువల చిత్రం: సామ్ బహదూర్ (హిందీ)
- ఉత్తమ ప్రజాదరణ చిత్రం: రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ (హిందీ)
- ఉత్తమ పరిచయ దర్శకుడు: ఆత్మపాంప్లెట్ (మరాఠీ) ఆశిష్ బెండే
- ఉత్తమ ఫీచర్ ఫిల్మ్: 12 ఫెయిల్

### నాన్ ఫీచర్ ఫిల్మ్స్ కేటగిరి

- స్పెషల్ మెన్షన్ చిత్రాలు నేకల్: క్రానికల్ ఆఫ్ ప్యాడీ మ్యాన్ (మలయాళం)
- ది సీ అండ్ సెవెన్ విలేజెస్ (ఒడియా)
- బెస్ట్ స్క్రిప్ట్: సన్ ఫ్లవర్స్ వేర్ ది ఫస్ట్ వన్స్ టు నో (కన్నడ)
- బెస్ట్ వాయిస్ ఓవర్: ది సేక్రెడ్ జాక్ – ఎక్స్‌ప్లోరింగ్ ది ట్రీస్ ఆఫ్ విషెస్ (ఇంగ్లిష్)
- బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
- బెస్ట్ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఇంగ్లిష్)
- బెస్ట్ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ)
- బెస్ట్ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళ్)
- బెస్ట్ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
- బెస్ట్ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఇంగ్లిష్)
- బెస్ట్ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ)
- బెస్ట్ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళ్)
- బెస్ట్ డైరెక్షన్ : ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
- బెస్ట్ ఆర్ట్స్/కల్చర్ ఫిల్మ్: టైమ్‌లెస్ తమిళనాడు (ఇంగ్లిష్)
- బెస్ట్ బయోగ్రాఫికల్ ఫిల్మ్: మా బావు, మా గావ్ (ఒడిశా), లెంటినో ఓవో ఏ లైట్ ఆన్ ది ఈస్ట్రన్ హోరిజాన్ (ఇంగ్లిష్
- ఉత్తమ పరిచయ దర్శకుడు: మావ్: ది స్పిరిట్ డ్రీమ్స్ ఆఫ్ చెరా (మిజో
- బెస్ట్ నాన్ ఫీచర్ ఫిల్మ్: ఫ్లవరింగ్ మ్యాన్ (హిందీ)




# చకచకా పెద్ది మూవీ షూటింగ్

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణం పై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటు–డు శివరాజ్ కుమార్‌తో పాటు, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.

## ఆసక్తికరంగా వచ్చిన వాడు గౌతమ్ టీజర్




యంగ్ హీరో అశ్విన్ బాబు చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్ సినిమా మీద ఆసక్తి ఏర్పరిచింది. ఈ సినిమాకి మామిడాల ఎం.ఆర్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న ఈ సినిమాని నిర్మాత టి.గణపతి రెడ్డి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో – ప్రొడ్యూసర్. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇం–టె–న్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ఇటివలే భారీ బడ్జెట్ తో హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు.



# రామాయణ మ్యూజిక్‌లో కొత్త ఒరవడి

## రుద్రవీణను ఉపయోగిస్తున్న ఎఆర్ రహమాన్

బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో 'రామాయణ'దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటు–డు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటు–డు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, –కై–కేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు ఆస్కార్ దిగ్గజాలు, ప్రముఖ సంతిత దర్శకులు ఆ.. రెహమాన్, హన్స్ జిమ్మర్ కలిసి సంతితం అందిస్తున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.రామాయణం సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం భారతీయ వాయిద్యాలలో పురాతనమైన రుద్ర వీణను రెహమాన్ ఉపయోగించబోతున్నట్లు– సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే మ్యూజిక్ పనులు కూడా మొదలు పెట్టినట్లు– తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన వెలుబడలేదు.



# కింగ్డమ్ పార్ట్ -2పై అప్పుడే ప్రకటన

విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్' పార్టీ 2 ఉంటుందని తేలిపోయింది. నాగవంశీయే ఈ విషయం చెప్పారు. కింగ్డమ్‌తో తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్–టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేసారు. మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం' అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం అన్నారు.

# మహావతార్ నరసింహకు జనం నీరాజనం




పౌరాణిక పాత్రలకు తిరుగులేదని మరోసారి నిరూపించింది 'మహావతార్ నరసింహ' అనే సినిమా. నిజానికి, ఈ సినిమాని హోంబాలే ప్రొడక్షన్స్ వాళ్ళు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చేవరకు అసలు ఈ సినిమా ఒకటి ఉందని కూడా ఆడియన్స్‌కి తెలియదు. హోంబాలే ఫ్యాన్ ఇండియా లెవెల్‌లో సినిమాని రిలీజ్ చేయడానికి రెడీ అవ్వడం, తెలుగులో తిత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడంతో సినిమా మీద చర్చ జరిగింది. తర్వాత వచ్చిన ట్రైలర్ కూడా పెద్దగా ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించలేకపోయింది. కానీ, సినిమా చూసిన వారంతా సినిమా అద్భుతం అంటూ అబ్బురపడుతూ సోషల్ మీడియాలో మౌత్ టాక్ స్ప్రెడ్ చేయడంతో సినిమాకి ఇప్పుడు కలెక్షన్ల వర్షం కురుస్తోంది. తాజాగా, ఈ సినిమా ఇప్పటివరకు 53 కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టినట్లుగా అధికారికంగా ప్రకటించింది సినిమా యూనిట్. ఇప్పటివరకు ఈ సినిమా 53 కోట్ల బాక్స్ ఆఫీస్ గ్రాస్ సాధించినట్లు– వెల్లడించారు. ఈ సినిమాని క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శిల్పా ధావన్ నిర్మించగా, అశ్విన్ దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సినిమాని హిందీలో అనిల్ తడానికి సంబంధించిన ఏ ఏ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూట్ చేయగా, ఒక్కొక్క భాషలో ఆయా భాషల్లో సిద్ధహస్తులైన డిస్ట్రిబ్యూటర్ల చేత రిలీజ్ చేయించారు. దీంతో సినిమా మీద అందరి దృష్టి పడడమే కాదు, సినిమా మంచి టాక్‌తో దూసుకుపోయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తెలుగు రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి విజయ్ దేవరకొండ కింగ్డమ్ సినిమా కంటే కొన్ని చోట్ల ఈ సినిమా బుకింగ్స్‌లో డామినేట్ చేయడం గమనార్హం. దాదాపు వారం గడుస్తోంది.

# అజయ్‌గా యోగి ఆదిత్యనాథ్ బయోపిక్

## చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరణ



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అజయ్' అనే సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ చిత్రానికి సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహిస్తుండగా.. యోగి పాత్రలో బాలీవుడ్ నటు–డు అనంత్ జోషి యోగి కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో పరేష్ రావాల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ప్రముఖ రచయిత శాంతను గుప్తా రాసిన 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమాకు సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. ఈ సినిమాకి సెన్సార్ ఇవ్వడం కుదరదని వెల్లడించింది. దీంతో ఈ చిత్ర దర్శక, నిర్మాతలు ముంబై హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం దీనిపై విచారణ జరుగబోతుంది. అయితే ఈ పిటిషన్‌పై కోర్టు స్పందిస్తూ.. సెన్సార్ బోర్డును కొన్ని ప్రశ్నలు అడిగింది. ఈ సినిమాకు ప్రేరణనిచ్చిన నవల ఎనిమిదేళ్ళుగా ప్రజలకు అందుబాటు–లో ఉన్నప్పుడు ఎటు–వంటి అభ్యంతరాలు రాలేదు. మరి అదే నవల ఆధారంగా తెరకెక్కిన సినిమాకు ఎందుకు అభ్యంతరాలు వస్తాయి.. సెన్సార్ ఎందుకు నిరకరించారో చెప్పాలంటూ సెన్సార్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. సినిమాకు సెన్సార్ ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై స్పందించిన బోర్డు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చింది.